జిల్లాలో 13 మండలాల్లో వడగాల్పులు ...!

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో సోమవారం నాడు 13 మండలాల పరిధిలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం ప్రజలను హెచ్చరించింది. ఈ మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఒక ప్రకటనలో వెల్లడించింది. వేపాడ మండలంలో 44.4, జామి లో 43, గజపతినగరంలో 42.5, బొండపల్లిలో 42.2, గంట్యాడ లో 41.9, మెంటాడ లో 40.8, కొత్తవలస, దత్తి రాజేరులో 40.3, చొప్పున ఉష్ణోగ్రతలు నమోద య్యే అవకాశం ఉందని తెలిపింది. వీటితో పాటు ఎల్.కోట లో 39.6, గుర్ల లో 39.5, విజయనగరంలో 39.2, రామభద్రపురం లో 38.3, ఎస్.కోటలో 35.8 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ మండలాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఎఆర్‌పేటలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్నం రాజుపేట పంచాయతీలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. స్థానిక టీడీపీ నేత ముకుంద శ్రీను ఆద్వర్యంలో గ్రామంలోని 3వవార్డుకు చెందిన వైసీపీ నేత రొక్కం భాస్కరరావు తన అనుచరులతోపాటు టీడీపీ కండువాను కప్పుకున్నారు. వీరంతా నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డా.కె.ఎ.నాయుడు సమక్షంలో టీడీపీ తీర్ధం పుచ్చుకున్నారు. అన్నంరాజుపేటలో భాస్కర రావు చేరికతో తెలగా కులస్థులలో టీడీపీ పట్టు సాధిస్తుందని, ఇది రానున్న ఎన్నికలలో టీడీపీకి బలంగా మారుతుందని స్థానిక టీడీపీ నేత ముకుంద శ్రీను అన్నారు. ఇదే భాటలో మరికొంఒతమంది టీడీపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే భాస్కరరావు టీడీపీలోకి చేరికకు వైసీపీలోని వర్గ విభేదాలే కారణమని గ్రామంలో స్థానికులు చెప్పుకోవడం విశేషం.

నేటి నుండి పూర్తిస్థాయి అందుబాటులోకి మహిళాపార్కు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: నగరంలో ప్రతిష్టాత్మ కంగా ఏర్పాటుచేసిన మహిళా పార్కును నేటి నుండి పూర్తిస్థాయిలో మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తు న్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మహిళా పార్క్ చేరుకుని పార్కు చుట్టూ కలియతిరిగి, స్వచ్ఛంద సంస్థల మహిళ ప్రతినిధులకు పార్కులో ఉన్న వివరాలను విశిదపరిచారు. స్విమ్మింగ్ పూల్ ను పరిశీ లించారు. అనంతరం మీడియాతో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ రాష్ట్రం లోని తొలి మహిళ పార్కుగా ప్రకాశం పార్క్ ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తీర్చిదిద్దారని కొనియా డారు. మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేయడం తో ఆయనకు మహిళలపై ఉన్న అభిమానం వ్యక్తం అవుతుందన్నారు. మహిళా పార్కు ప్రతిరోజు ఉద యం 5 నుంచి 9 వరకు మరల సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుందని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు ప్రవేశ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కేవలం మహిళలకు మాత్రమే పార్కులోకి ప్రవేశించే విధంగా ఏర్పాట్లు చేసామన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ కోసం నిష్ణాతులైన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కావున మహిళలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

104 వాహన ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి ...

ఉద్యోగులకు ఎమ్మెల్సీ రఘురాజు హామీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలములోని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 104 ఉద్యోగులు తమ జీతభత్యాలు మరియు సేవలకు సంబం ధించిన సమస్యలపై బొడ్డవరలోని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుని ఆయన స్వగృహంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భముగా 104 ఉద్యోగులుగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 2020 కరోనా కాలం నుంచి సుదూర ప్రాంతాలలో పని చేస్తున్న ఉద్యోగులకు, కొత్త 104 వాహనంసేవకు బదిలీలు కల్పించాలని, 104 ఉద్యోగులకు అరబిందో కంపెనీ యాజమాన్యం చెల్లించవలసిన ప్రావిడెంట్ ఫండ్ వాటా యాజ మాన్యం వారే చెల్లించే విధంగా, ఐదు నుండి పది సంవత్సరాలు పూర్త యిన సీనియర్ డ్రైవర్లకి స్లాబ్ సిస్టం మరియు, జాయినింగ్ ఆర్డర్లో ప్రతి ఆరు నెలలుకి జీతాలు పెంచు తామని చెప్పిన విధంగా పెంచాలని, ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ రఘురాజు 104 ఉద్యోగుల సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారమునకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 104 విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు కోటరావు, రవీంద్రుడు, రమేష్, సత్యనారాయణ, నాయుడు, రమేష్, మహాలక్ష్మి, తులసి, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా ఆగేనా...?

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో హెడ్‌క్వాటర్ మద్యం షాపుల దగ్గర నుంచి బస్తాలకు బస్తాలు మద్యం బాటిళ్లను బెల్ట్‌షాపు ఓనర్లు తరలించుకుపోతున్నారని గ్రామంలో పలువురు విమర్శిస్తున్నారు. విషయాల్లోకి వెళ్తే ... ప్రభుత్వం ఎక్కడ బెల్ట్‌షాపులు ఉండకూడదని ఓ వైపు నిబంధనలు విధిస్తున్నారు. అలాగే ఎవరూ ఎక్కడ బెల్ట్ నడిపించకూడదని, పల్లెల్లో మద్యం అమ్మకాలు జరగకూడదనీ ప్రజలు బాగుండాలని ఉద్దేశంతో పటిష్టమైన చట్టంచేసి దొరికిన వారిపై వెంటనే కేసులు కట్టి అరెస్టు చేస్తున్నప్పటికీ ఎక్కడబడితే అక్కడ అక్రమ మద్యం తరలించుకుపోతునే ఉంది. దీన్ని అలవాటు పడి నేరుగా బ్రాంది షాపు సూపర్‌వైజర్‌తోనే కాంటాక్ట్ కుదుర్చుకుని వందలాది బాటిల్లు గోనెచంచుల్లో, బస్తాల్లో బల్లమీద తరలించుకు పోతునే ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సూపర్‌వైజర్లు కూడా ముడుపులకు లొంగి ఎన్ని కావాలంటే అన్ని బాటిల్లు బెల్ట్ షాపు ఓనర్లతో కుమ్మక్కై మద్యాన్ని అక్రమ రవాణాకు పాల్పడుతునే ఉన్నారనీ పలువురు విమర్శిస్తున్నారు. గవర్నమెంట్ పెట్టిన నిభందనలు అయితే మద్యం షాపుల నుంచి ఒక వ్యక్తికి మూడు బాటిల్లు చొప్పున కొనుక్కోవాలనీ అంతకు ఎక్కువ ఆరి వద్ద ఉంటే అరెస్టు చేస్తామన్న నీబంధనలు ఉన్నప్పటికీ బ్రాంది షాపులో పనిచేసిన సూపర్వైజర్లు ఈ నిభందనలు తుంగలోతొక్కి అక్రమంగా బెల్ట్ షాపు నడిపిన వ్యక్తులతో టైయప్ అయ్యి ఈ మోసాలకు పాల్పడుతున్నాంని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఏదో ఒక చోట పోలీస్ నిఘా ఏర్పాటుచేసి అరెస్ట్ చేసినప్పటికీ మద్యం షాపులనుంచి దొడ్డిదారిన బస్తాలతో మద్యం తరలించుకుపోతున్నారనీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హనుమాన్ అనుగ్రహం అందరిపై ఉండాలి : ఎమ్మెల్యే కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : హనుమంతుడు ధైర్యం, విధేయత, విశ్వాసం, నమ్మకం, భక్తి, నిస్వార్ధతకు మారుపేరు అని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మారుతి అనుగ్రహం భక్తులం దరిపైనా ఉండాలని ప్రార్థించారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలోని మూడు కోవెళ్లు, అయ్యకోనేరు తూర్పు గట్టున ఉన్న పెద్ద ఆంజనేయస్వామి, పంచ ముఖ ఆంజనేయస్వామి, కనపాక యాదవ వీధిలోని శ్రీ అభయస్థ ఆంజనేయ స్వామి దేవాలయాలను ఆయన సందర్శించారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీ ప్రతిని ధులు, అర్చకులు కోలగట్లకు సాదర స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కోట సమీపంలోని హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ విగ్రహావిష్కరణ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద కోలగట్ల మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుం టున్నారని చెప్పారు. ఇక్కడ ఆలయ నిర్మాణం దగ్గర నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రధానంగా నిత్యాన్నదాన సేవలను అభినందించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు

రామభద్రపురం : హనుమాన్ జయంతి సందర్భంగా రామభద్రపురం, భూ సాయవలస, ఆరిక తో ట, రోంపల్లి, తదితర గ్రామాలలో ఆదివారం హను మాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుక సందర్భంగా, భక్తులకు పులిహోర, ప్రసాదం పంపిణి చేశారు.రామభద్రపురం,లో గాంధీ బొమ్మ కూడలి వద్ద ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద రాష్ట్ర టీడీపీ కార్య నిర్యహన కార్యదర్శి, చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు.

విద్యార్థి.దశ నుండి పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఆశయ సంస్థ అధ్యక్షులు రమణ

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రంధాల యం సూచిన మేరకు జిల్లా గ్రంధాలయం మరి యు చీపురుపల్లి శాఖ గ్రంధాలయం ఆవరణలో ఈ నెల 8 నుండి జూన్ 10 వరకు జరుగుతుంది. విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటుచేసారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆశయ సంస్థ అధ్యక్షులు మరియు ఆశయ రూరల్ లైబ్రరీ వ్యవస్థాపకుడు రెడ్డి రమణ మాట్లాడుతూ నేటితరం సెల్‌ఫోన్ల కారణంగా బాల్యంలో చాలా మందికి కంటి చూపు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మా సంస్థ ద్వారా మొబైల్ లైబ్రరీ. ద్వారా అనేకమంది విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాఖ గ్రంధాలయం లైబ్రరీయన్ ఎ. బుచ్చింనాయుడు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యువగళం పేరుతో పాదయాత్ర

విశాలాంధ్ర-చీపురుపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర రేపటితో 100వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఈ నెల 15, సోమవారం ఉదయం 9:00 గంటలకు చీపురుపల్లి నాగార్జున ఇంటి వద్ద పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చీపురుపల్లి అభివృద్ధి ప్రదాత డా కిమిడి మృణాళిని పాల్గొననున్నారరి ఆయన అన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

బాడంగి గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

వినియోగించుకుంటున్న విద్యార్థులు

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: గ్రంథాలయంలో వేసవి శిక్షణను (తేదీ:08-05-2023 నుండీ 11-06-2023 వరకు మొత్తం 35 రోజులు) తరగతుల లో భాగంగా 7వ రోజు పిల్లలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు పిల్లలకు గణితంలో షేప్స్ మరియు గణితంలో గమ్మతులు వివిధ అంశాలపై బోధించడం జరిగింది. అదేవిధంగా పిండ్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు రవి బాబు పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీషు క్లాస్ బోధించడం పిల్లలకు కుర్చీలాట బాడంగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రహీమ్ చిన్న పిల్లలకు కథలు చెప్పించడం జరిగిందని గ్రంథాలయా ల అధికారి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణా తరగతులను అందరూ తప్పకుండా వినియోగించుకోవాలి కోరారు.

దంతవైద్య శిబిరానికి విశేష స్పందన



విశాలాంధ్ర-నెల్లిమర్ల : కొండ వెలగాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత దంతవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ గదల బంగారమ్మ ప్రారంభించారు. శిబిరంలో 230 మందికి వైద్యసేవలందించారు. గదల బంగారమ్మ మాట్లాడుతూ వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియన్ దంతవైద్య శాల సిబ్బంది రోగులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో నాయకులు మొయిద అక్కోజి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు నిర్మాణం చేపట్టిన గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని సింగ రాయి గ్రామపంచాయతీ శివారు కొత్త సింగరాయి గ్రామస్తులు ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా తమ గ్రామ ప్రధాన రహదారి రోడ్డుమార్గంను తమ సొంత ఖర్చులతో నిర్మాణ పనులు చేపట్టారు. మండలంలోని సోంపురం-వేపాడ ప్రధాన రహదారిలోని జగ్గయ్యపేట కోనేరు దగ్గర నుండి కొత్త సింగరాయి గ్రామానికి వెళ్లేందుకు కొన్నేళ్ల ముందు నుండి మట్టి రోడ్డు ఉంది.ఆ మట్టి రోడ్డు పెద్ద పెద్దగోతులతో ప్రమాదకరంగా మారినా ఇటు పంచాయతీ పాలకులు గానీ అటు అధికారులు గానీ పట్టించుకునే దాఖ లాలు లేవు. పాడైన రోడ్డు మార్గానే నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,రోజు వారి కూలీలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. విశేషమేమిటంటే ప్రఖ్యాతిగాంచిన అయ్యప్ప స్వామి దేవాలయం కూడా ఆ గ్రామంలో ఉండడం. ఆ దేవాలయానికి వెళ్లే భక్తులు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి గ్రామానికి తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు యువకులు కోరుతున్నారు.

కూచిపూడి నృత్య కళాకారిణి వాణి పద్మజ కు ఘన సన్మానం

విశాలాంధ్ర-బొబ్బిలి : ఈనెల 13న నిన్న విశాఖ లో బొబ్బిలి కి చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారిణి నృత్య గురువు పద్మాలయ డాన్స్ అకాడమీ ఫౌండర్ వాణి పద్మజ కు నృత్య కళ కు ఆమె చేస్తున్న సేవ కు విశాఖలో ఎన్టీఆర్ కళ అకాడమీ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ లు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలుగు సాంస్కృతిక అకాడమీ చైర్మన్ డాక్టర్ నందమూరి లక్ష్మి పార్వతి చేతులు మీదుగా ఎన్టీఆర్ స్మరఖా అవార్డు ని స్వీకరించారు. బొబ్బిలి వాసి కు ఈ అవార్డు రావడం పట్ల బొబ్బిలి ప్రముఖులు వాణి పద్మజ కు అభినందనలు తెలిపారు.

బూర్జ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలుపుదల

విశాలాంధ్ర-సీతానగరం: బూర్జ పరిదిలో సబ్ స్టేషన్ మైంటైనెన్స్, 33కేవీ మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 9.00నుండి సాయంత్రం 5.00వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కోట్ల సోమేశ్వరరావు తెలిపారు. బూర్జ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగ దారులు దీన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బూర్జ, లక్ష్మీపురం, కృష్ణరాయపురం, పెదంకలం, సుమిత్రపురం, వెంకటపురం, నిడగల్లు తదితర గ్రామాల్లో వినియోగ దారులు దీన్ని గమనించాలని కోరారు.

ఇప్పలపోలమ్మను దర్శించుకున్న రవికుమార్

పండగకు రూ.10వేల విరాళం

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం పట్టణ ఇల వేల్పు గ్రామదేవత ఇప్పల పోలమ్మను ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, పార్వతీపురం పట్టణవాసి కోడిగుడ్ల రవికుమార్, అతనిభార్య పట్టణ పురపాలక సంఘం కౌన్సిలర్ కోడిగుడ్ల అనంతలక్ష్మి, కుటుంబసభ్యులు కలసి ఆదివారం దర్శించుకున్నారు.తల్లి ఆశీస్సులు పార్వతీపురం పట్టణానికి,కుటుంబానికీ ఉండాలని కోరుకున్నట్లు రవికుమార్ తెలిపారు.ఈనెలాఖరులో నిర్వహించ నున్న గ్రామదేవత ఇప్పలపోలమ్మ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు అమ్మవారి పండగ నిమిత్తం కోడిగుడ్ల రవికుమార్ దంపతులు పదివేల రూపాయలను కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. శనివారం కర్ణాటకఅసెంబ్లీ ఎన్నికల ఫలితాల సంధర్భంగా వివిధ చానల్లో రవికుమార్ విశ్లేషణలు చూసిన వారంతా ఆయన్ను అభినందించారు.పార్వతీపురం పేరును దేశ,విదేశాల్లో ప్రాచుర్యం కల్పిస్తున్న రవికుమార్ ను పలువురు కలిసి మెచ్చుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

విశాలాంధ్ర-సాలూరు టౌన్: ఆగి ఉన్న లారీని రామభదపురం నుండి వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్తే సాలూరు పట్టణం ముత్యాలమ్మ తల్లి గుడి దగ్గర పక్కనున్న లైన్స్ అగర్వాల్ కాలేజ్ ముందు ఉదయం 8 గంటల సమ యంలో ఏపీ 39 3479 లారీని,ఏపీ 39 యు.జి.9817 లారీ ఢీ కొట్టింది. 98 17 లారీ డ్రైవర్ అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లారీకి ఢీకొట్టింది. ఆ సమయంలో ఆ వాహనంలో ఎవరూ లేరు. అలాగే రోడ్డుపై ఎవరూ లేక ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. సంఘటన స్థలానికి సమయానికి పట్టణ పోలీసులు చేరుకొని అక్కడున్న ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

104 వాహన ఉద్యోగస్తులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉప ముఖ్యమంత్రి పీడికి రాజన్నదొరకు ఏపీ 104 ఎంఎంయూ ఈయూ వినతి

విశాలాంధ్ర-సాలూరు టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న 104 వాహన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ వారు డిమాండ్ చేశారు. ఆదివారం 104 వాహన ఉద్యోగులు డ్రైవర్,డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరకు వారి కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు యూనియన్ వారు వినతిపత్రాన్ని అందజేశారు. మాకు 104 వాహన సేవలో గతంలో వలె రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలి. జీవో నెంబర్ 4459 ప్రకారం పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని యాజ మాన్యం చెల్లించిన ఎంప్లాయ్ కంట్రిబ్యూషన్ అరబిందో యాజ మాన్య చెల్లించాలని. డీఎస్సీ ఆర్‌ఓఆర్ ద్వారా నియమించబడిన సీనియర్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 0-4, 5-10-10 సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారికి స్లాబ్ సిస్టం ఆటోమేటిగ్గా అప్డేట్ చేయాలి. ప్రతినెల సక్రమంగా వేతనాలు, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ 104 ఉద్యోగస్తులు మీరు కోరిన ముఖ్యమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి వద్దకు తీసుకొని వెళ్తానని మీకు ప్రతి నెల సక్రమంగా జీతాలు అందేలాగా, మీకు ఉద్యోగ భద్రత కల్పించే లాగా చూస్తానని అన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తా ...

ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: 104 ఉద్యోగుల సమస్యలను ముఖ్య మంత్రి దృష్టికి తీసు కువెళ్లి ఆ ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం పలువురు 104 ఉద్యోగ నాయకులు వారి సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శాసన సభ్యులకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 104 ఉద్యోగులను కాంట్రాక్టు, లేదా ఆప్కాస్ లలో అబ్జర్వ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెంబర్ 4459 ప్రకారం పీఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతిపురం మన్యం జిల్లా యూనియన్ నాయకులు ఆనందరావు, స్వామినాయుడు గోవిందరావు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మామిడిపల్లి లో పోలీసుల కవాతు

విశాలాంధ్ర-సాలూరు రూరల్: మండ లంలో మామిడి పల్లి గ్రామంలో ఆదివారం రూరల్ సిఐ ధనంజయనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి గ్రామంలో ముంగా రమ్మ తల్లి గ్రామదేవత పండుగ జరుగుతున్న నేపథ్యం లో పోలీసు ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ముందస్తు చర్యలు తీసుకుం టున్నామన్నారు. అందులో భాగంగా గ్రామంలోని వీధులగుండా పోలీసు కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు రూరల్ సిఐ ప్రయోగమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో 17న రౌండ్ టేబుల్

విశాలాంధ్ర-బెలగాం : దళితుల హక్కుల సాధన కోసం, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 17న ఎన్జీఓ హోంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు గుజ్జ జనార్దన, ఎస్.సింహాచలం పిలుపు నిచ్చారు, ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు అంటరాని తనం, గ్రామ బహిష్కరణ, అభివృద్ధిలో వెనుకబడి పోవడం, దళిత యువతపై దాడులు, దళిత ఉద్యోగులపై దాడులు, హత్యలు జరుగు తున్న నేపథ్యంలో రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, అన్యాయంపై కూలంకుషంగా చర్చించి, భవిష్యత్ దళిత ఉద్యమానికి బాటలు వేసే విధంగా దళిత పెద్దలు, దళితు ఉద్యోగులు, రాజకీయ పార్టీ నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గరుగుబిల్లి సూరయ్య పువ్వల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కురుపాం: మండలంలో పలుచోట్ల హనుమ జయంతి వేడు కలు ఘనంగా నిర్వహిం చారు. ఆదివారం స్థానిక అభయాంజనేయ ఆల యంలో ఆకుల రామ్మోహన్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంచాలని కోరుతూ పూజలు నిర్వ హించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.

సీతంపేట: సీతంపేట మండ ల కేంద్రంలో స్థానిక మెయిన్ రోడ్ లో శ్రీ జై హనుమాన్ జన్మదినం వేడుకలు ఆలయ అర్చకులు కేశవ శర్మ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వ హించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయ స్వామికి పూజలు చేసి ఆయన ఆశీస్సులు పొందారు.

పాలకొండ: మండల, పట్టణ పరిధిలో వాడ వాడలా హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు తాకిడితో కిటకిటలాడాయి. హనుమాన్ జయంతి సందర్భంగా సింధూర పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో జై శ్రీరామ్ అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు స్థానిక దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నారాయణ సేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులతోపాటు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో కొత్తవారికే టీడీపీ టిక్కెట్...!

సరైన అభ్యర్థుల అన్వేషణలో టీడీపీ వర్గీయులు

అధిష్టాన నిర్ణయానికి నేతల ఎదురుచూపులు

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట: రానున్న సాధారణ ఎన్నికలలో డీ అంటే డీ అన్నట్లు ఆంధ్రప్రదేశ్ నుండి అధికార, ప్రతిపక్షాలు యుద్ధానికి సిద్ధమవు తున్నాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాలు వచ్చాక రకరకాల విశ్లేషణలతో చోటానేతల నుండి రాష్ట్రస్థాయి నేతలవరకు, రచ్చబండ నుండి రాష్ట్ర పార్టీ కార్యాలయాలవరకు చర్చలు ప్రారంభయ్యాయి. 175/175 వస్తాయని అధికారపక్షం ధీమాతోఎప్పటికప్పుడు జరుగుతున్న వివిధ సమావేశాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెబుతుండగా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నిర్వహించే మీటింగులు, రాష్ట్రానికి ఇదేం ఖర్మ మీటింగులు,జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్రలవల్ల పార్టీ విజయం సాధించడం ఖాయమని టీడీపీ నాయకులు అంటున్నారు. టిడిపిలోరాష్ట్ర క్యాడర్ సక్రమంగా పనిచేస్తున్న నియోజక వర్గంలోని క్యాడర్ మాత్రం వెనుకంజలో ఉన్నారని ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. అధికారపక్షం గడప గడపకు మన ప్రభుత్వం, ఇంటింటికి జగనన్న, జగనన్నే మానమ్మకం వంటి కార్యక్రమాలతో నిత్యం ప్రజలకు దగ్గరలో ఉన్నట్లు, ఉండేలా స్థానిక ఎమ్మెల్యే జోగారావు తనదైన శైలిలో నిర్వహిస్తూ నిరంతరం కష్టపడి పని చేస్తున్నారు.టీడీపికు సంబందించి ఈనెలలో రాజమండ్రిలో జరగనున్న మహానాడుతో టిడిపి జోష్ పెరగడం ఖాయమని, మహానాడు నుండి ఎన్నికల నిర్వహణ వరకు పరుగులు ఉంటాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పార్వతీపురం ఎస్సీ రిజర్వడ్ నియోజకవర్గం అయ్యాక మొదటిసారి 2009లో సవరపు జయమణి (కాంగ్రెస్) 2014లో బొబ్బిలి చిరంజీవులు (టిడిపి) 2019లో అలజింగి జోగారావు(వైఎస్సార్సీపీ)లు సమీప ప్రత్యర్థిలు బొబ్బిలి చిరంజీవులు, ప్రసన్న కుమార్, బొబ్బిలి చిరంజీవులపై గెలిచారు. టిడిపి తరుపున మూడు సార్లు బొబ్బిలి చిరంజీవులు పోటీచేయగా ఒకసారి గెలిచి, రెండుసార్లు ఓటమి చెందారు. సవరపు జయమణి ఎమ్మెల్యే కాకముందు ఎంపిపిగా, జెడ్పీటీసీగా, కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు చేపట్టడంతో ఆమెకు అప్పట్లో టికెట్ రావడం, ఆమె మంచితనం, కాంగ్రెస్ హవా ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన టీడీపీ అభ్యర్థి చిరంజీవిలు గెలుపులో కూడా టీడీపీ ప్రభంజనం, అప్పట్లో వైఎస్సార్సీపీ తరపున పోటీ చేసిన జమ్మాన ప్రసన్న కుమార్ చివరి నిమిషంలో సరైన నిర్ణయం తీసుకోక పోవడంవల్ల, ఉపాధ్యాయ సంఘాల మద్దతు, ఎదుటవ్యక్తిని గౌరవిస్తారని, గత ఎన్నికల్లో ఓటమివల్ల వచ్చిన సానుభూతి, తదితర అంశాల పట్ల చిరంజీవులు గెలిచారని అంతా చెబుతున్నారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన జోగారావు తనదైన శైలిలో ఎన్నికలను చాలెంజుగా తీసుకోవడం, జగన్ పాదయాత్ర విజయ వంతంచేయడం, నూతన నాయకులను తయారుచేసుకోవడం, నియోజకవర్గంలోని అధికార, ప్రతిపక్ష నాయకుల తో లాభీయింగు, విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లడం, వైఎస్సార్సీపీ ప్రభంజనం, నాయకులంతా ముక్తకంఠంతో కలిసికట్టుగా పనిచేయడంవల్ల, ఎన్నికల ముందు రెండేళ్ల రాత్రనక పగలనక కష్టపడి పనిచేసి కార్యకర్తలను గౌరవించడం వంటి అంశాలు సులభంగా జోగారావు ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించడానికి దోహదపడ్డాయి. ఆయన కూడా 2014లో చివరినిమిషంవరకు టిడిపి టిక్కెట్ ఆశించి భంగపడిన తరువాత అప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ తరుపున టిక్కెట్ తెచ్చుకొని పోటీ చేశారు. ఇదిలా ఉండగా రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ తరుపున నియోజక వర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు(పార్వతీపురం గ్రామీణ),గర్భాపు ఉదయభాను (పార్వతీపురం పట్టణం), వాదాడ రాము (బలిజిపేట),సీతానగరం నుండి మేజర్ పంచాయతీకి చెందిన ఒకరు టిక్కెట్ ఆశిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు,యువతకు, కొత్తవారికే ఎక్కువగా టిక్కెట్ ఇస్తామని పార్టీకీలక నేతలు చెబుతున్నవేళ కొత్త కొత్త నేతలు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఈనేపథ్యంలో పైనచెప్పిన వారితోపాటు గత టిడిపిప్రభుత్వంలో కీలకమైన వ్యక్తి (పక్కజిల్లా) తాలూకావారు కూడా రేసులో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతోపాటు కీలకమైన వివిధ శాఖలకు చెందిన ముగ్గురు అధికారులు కూడా నియోజక వర్గంలోని పార్టీశ్రేణులను కలవడమేగాక కేంద్ర కమిటీ నేతల చుట్టూ తిరుగుతూ తమకు అవకాశం కల్పిస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ చేస్తామని చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ద్వారా తెలిసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తరువాత టీడీపీలో జోరు పెరిగిందన్నది వాస్తవం. అధికారపక్షం నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే అలజింగి జోగారావుకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు అతనిఅనుచరులు చెబుతున్నారు. ఆయనతో పాటు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణిలు కూడా రేసులో ఉన్నట్లు వారి అనుచరులు చెబుతున్నారు. ఏదిఏమైనా 2024జనవరి లేదా ఏప్రెల్లో జరిగే ఎన్నికలు నేతలకు, అధికారులకు, ఓటర్లకు, విశ్లేషకులకు కత్తిమీద సామేనని స్పష్టంగా కనిపిస్తుందిమరి. దసరా నుండి ఎన్నికల వేడి పెరిగే అవకాశం ఉందని నాయకులు అంటున్నారు. నియోజక వర్గంలోని టీడీపి నాయకులు మధ్య సమన్వయం లేదన్నది అందరికీ తెలిసిందే. ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు తరపున కొంత మంది ఉండగా, మాజీ ఎమ్మెల్సీ జగదీష్ తరుపున మరికొంత మంది ఉండి కార్యక్రమాలు చేపడుతున్నారు. రెండు వర్గాలను ఒకటి చేసేందుకు ప్రయత్నాలు చేసినా దాఖలాలు లేవని, ఇలా ఉండటం వల్ల పార్టీ కార్యక్రమాలు మమా అనేలా సాగుతున్నాయి. ఈదశలో పార్టీ అధిష్టానం దృష్టి సారించాలని, న్యాయం చేసే చర్యలు తీసుకోవాలని పార్టీ క్రింద నున్న క్యాదరు కోరుతుంది.

పంచముఖాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: వైశాఖ బహుళ దశమి హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం ఎస్. సి.ఎస్.రోడ్లో వేంచేసి యున్న శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయంలో హనుమజయంతి పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద మల్లేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, సింధురార్చన, లక్ష తమలపాకులు అర్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అనేకమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. శాసన సభ్యులు మరియు ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి దేవాలయంను సందర్శించి స్వామివారి తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ఆలయం కమిటీ సభ్యులు అనేక సేవాకార్యక్రమాలు చేపడుతున్నారని,అన్నార్తులకు ఆకలి బాధలు తీర్చడమే కాకుండా, పేదల పెళ్లిళ్లకు, క్రీడాకారులుకు,సాహిత్య కార్యక్రమాలుకు,అనేక విధాలుగా సమాజహితం కోసం పాటుపడుతుండడం గొప్ప విషయం అన్నారు.అనంతరం భక్తులకు మహాఅన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ మడిపల్లి చలం, పెంటపాటి కామరాజు, కొండబాబు, వీరభద్రరావు, బాల,గోకవరపు ఉదయ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవంలో డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరంటౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం అయ్యన్నపేటలో వెలసిన హనుమాన్ ఆలయాన్ని ఆమె దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు ఆమెకు సాదర స్వాగతం తెలిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వాహకులతో ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా దర్శన ఏర్పాట్లు గావించాలని సూచించారు. ఆ మారుతి ఆశీస్సులు నగర ప్రజలు అందరి పైనా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

ప్రజలకు హనుమజ్జయంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : హనుమాన్ జయంతి సందర్భంగా ఎస్.కోట మండలం, బొడ్డవరలో గల అభయ ఆంజనేయస్వామి వారిని కుటుంబ సమేతముగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ప్రజలకు హనుమజ్జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ వెంట ఈ పూజా కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సంది సోమేశ్వరరావు, కిల్తంపాలెం సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, పెదఖండేపల్లి సర్పంచ్ యాళ్ళ రమణ, ఎం.పి.టి.సి బోదల దేముడు, నాయకులు వర్మ, రాము పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో యూత్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్

విజయనగరంటౌన్ : శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జ్ అవనాపు విక్రమ్ నగరంలోని సిటీ బస్టాండ్, బుచ్చన్న కోనేరు, కణపాకలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవనాపు విక్రమ్ కి ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు, అర్చకులు ఆలయ సంప్రదాయానుసారం సాదర స్వాగతం పలికి పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు అందించారు. సిటీ బస్టాండ్ వద్ద అభయాంజనేయస్వామి వారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త,అర్చకులు వి.కె.గాయత్రి శర్మ హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక సేవా కార్యక్రమంలో విక్రమ్ చే పూజలు చేయించారు. బుచ్చన్నకోనేరు వద్ద శ్రీశ్రీశ్రీ విజయ గణపతి సమేత హనుమ ఆలయంలో అవనాపు విక్రమ్ తో పాటు ఆలయ ధర్మకర్త ఎమ్. అప్పలనాయుడు, కమిటీ సభ్యులు కాళ్ళ సురేష్, గంగరాజు, వంక అప్పలరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు. కణపాక భక్త హనుమాన్ ఆలయంలో పాల్గొన్న అవనాపు విక్రమ్ ఆలయ నిర్వాహకులు కొండ్రు శ్రీనివాసులు,సూర్య రాములు, పీతల్ల రాజు, ఈగల నారాయణరావు తదితరులు సాదర స్వాగతం పలికి, ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. హిందూ సంప్రదాయాలను భావితరాలకు అందించడానికి ఆంజనేయ స్వామి వారి ఆలయాల్లో నిర్వాహకులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా విక్రమ్ అభినందించారు. అంజనీ పుత్రుడు ,భవిష్యత్ బ్రహ్మ, రామభక్త హనుమాన్ జయంతి సందర్భంగాస్వామి వారి సేవలో తరించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, హనుమంతుని ఆశిస్సులతో ప్రజలంతా సుఖః సంతోషాలతో ఉండాలని అభిలాషించారు.

వైభవంగా శ్రీ అభయాంజనేయ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి భక్తుడు ఎల్ఐసి ఏజెంట్ వానపల్లి తమ్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం అభయాంజనేయ జన్మదిన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే ఉదయం 6గంటలనుండి గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ధూప,దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్ఐసి ఏజెంట్ తమ్మయ్య దంపతులు సమకూర్చిన పులిహోర ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.ఈ సందర్భంగా హనుమాన్ భక్తుడు తమ్మయ్య మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి కరుణాకటాక్షాలు గ్రామస్తులకు ఎల్లప్పుడూ ఉండాలని,పంటలు బాగా పండాలని,అలాగే గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మెలగాలని స్వామివారికి పూజలు చేసి మొక్కుకున్నారు.

అలరించిన గాత్ర కచేరి

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం పట్టణం కుసుమగుడ్డి వీధి శ్రీ రామా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అభయాంజనేయ దేవాలయం ప్రాంగణంలో ఆదివారం హనుమత్ జయంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా విజయనగరంకు చెందిన సప్త స్వరాలయం వారిచే నిర్వహించబడిన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. తమ్మిన రవికుమార్ వయోలిన్ సాహితిప్రియ మృదంగ సహకారంతో షణ్ముఖ ప్రియ ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు ధన్యాసి రాగంలో సంగీత జ్ఞానము సిద్ధి వినాయక వేదములే నీ నివాసం వంటి అన్నమాచార్య కీర్తనలు ఎంతగానో అలరించాయి. ప్రదర్శన అనంతరం కళాకారులను శ్రీ రామా యువజన సంఘం సభ్యులు సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమాలలో సత్యసాయి సేవా సమితి బాలవికాస కేంద్రం చిన్నారులు భక్తి గీతాలతో ఆకట్టుకోగా పట్టణానికి చెందిన రాజేష్ జ్యోషి హనుమాన్ చాలీసా వినిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పలు వీధులకు చెందిన భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.

'నిప్పుల కుంపటి'

- 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..
- కర్ఫ్యూని తలిపిస్తున్న ప్రధాన రహదారులు

మనుష్యసంచారం లేక బోసిపోయిన రహదారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : భానుడు ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిప్పులు కురిపించాడు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వేడికి తట్టుకోలేక విలవిలలాడిపోయారు. నిత్యం కళకళ లాడే విశాఖ-అరకు ప్రధాన రహదారిలో బొడ్డవర జంక్షన్తో పాటు ధర్మవరం, జామి తదితర ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 11గంటల సమయానికే అధికమైన ఎండవేడి తగలడంతో ప్రజలు ఇళ్ల నుంచి పైకి వచ్చేందుకు పలు అవస్థలు పడ్డారు. చిన్న చిన్న పనులపై బయటకు వచ్చిన వారు నెత్తిన గొడుగులు వేసుకుని కొందరు, మరికొందరు టోపీలు, తువ్వాళ్లు కప్పుకుని, ముఖానికి రుమాలు వంటివి చుట్టుకుని పరుగులు తీసారు. ఇదే సందర్భంలో పలువురు మాట్లాడుతూ ఇన్నాళ్లు అడపాదడపా తుపాను వర్షాలు కురవటంతో ఎండలు తెలిసిరాలేదని, ఈ రోజు వేసవి ఎండలో నుంచి వెళ్తుంటే మంటల్లోంచి వెళ్తున్నట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ఎండవేడికి శ్లాబ్, కాలనీ ఇళ్లలో ఉండలేక పలు గ్రామాల్లోని ప్రజలకు అవస్థలు ప్రారంభమయ్యాయి.

తగిన జాగ్రత్తలు తీసుకోండి..

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పనులపై ఇళ్ల నుంచి రోడ్లపైకి వచ్చే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత మేర ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల లోపు ఎండలో బయటకు రాకుండా ఇళ్లలో ఉండటం మేలన్నారు. ఒకవేళ ఎండలో బయటకు వచ్చిన వారు వదులైన కాటన్, ఖద్దరు రకం దుస్తులను వేసుకోవాలని, వీలైనంతలో లైట్ కలర్ దుస్తులనే వాడాలని, నడిచేవారు తప్పనిసరిగా గొడుగు వేసుకోవాలన్నారు. ఎప్పటి కప్పుడు చల్లని నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, బార్లి, గెంజి, ఐస్ కలపని పళ్ల రసాలు వంటి ద్రవపదార్థాలు తరచుగా తాగాలి.

...ఆర్. త్రినాథరావు,
సిహెచ్సీ రిటైర్డ్ సూపరింటెండెంట్, శృంగవరపుకోట

విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖ గ్రంధాలయంలో ఆదివారం మాతృ దినోత్సవం పురష్కరించుకుని కన్న తల్లి కవితలు విద్యార్థులచే చదివించడం జరిగింది. మరియు విజ్ఞాన శిభిరంలో భాగంగా పిల్లలచే క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగిస్తాయి అని ఈ పోటీలు నిర్వహించడం జరిగిందని స్థానిక గ్రంధాలయ అధికారి సి. హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.

ఘనంగా కోటమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: జిల్లా ప్రజల ఇలవేల్పు, కొట్టాం గ్రామదేవత కోటమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.జగన్నాధం ఆధ్వర్యంలో ఉదయం నుంచి కుంకుమ పూజలతో పాటూ అర్చనలు జరిగాయి. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పసుపు, కుంకుమలతో పాటూ చీరలు, రవికెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులతో తరలివచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో గల షెడ్లలో వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేసారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : అత్యాధునిక సంతాన సాఫల్య కేంద్రం మన విజయనగరంలో ప్రారంభించడం అభినందనీయమని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. లండన్ ఐ వి ఎఫ్ కేంద్రాన్ని నగరంలోని మఠం వీధి వద్ద ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంతానం లేని అనేక జంటలకు ఆధునికమైన ప్రపంచ శ్రేణి చికిత్సను లండన్ ఐవిఎఫ్ కేంద్రం అందిస్తోందన్నారు. సంతానలేమితో బాధ పడుతున్న జంటలకు ఈ తరహా చికిత్స విధానం ఒక వరమని తెలిపారు. తక్కువ ఖర్చుతో చికిత్స అందించాలని, తద్వారా ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపాలని నిర్వాహకులను ఆమె కోరారు. తమ కేంద్రం ఆవశ్యకతను సెంటర్ డైరెక్టర్ కె.చంద్రారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రవిచంద్ర, సుధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమ జయంతి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవ స్థానంలో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి పంచామృత స్నపనం నిర్వహించారు. తమలపాకులు, సిందూరంతో సహస్రనామ పూజను అర్చకస్వాములు వైభ వంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ఇఓ కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలం లోని పక్కి గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఆంజనేయస్వామిని దర్శించుకుని ఆకుపూజ, తదితర పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో ప్రజలు పెద్ద ఎత్తున ఆంజనేయ స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి దర్శించుకున్నారు.

నేడు తోటపల్లిలో శ్రీనివాస కళ్యాణ వేదిక శంఖుస్థాపన

విశాలాంధ్ర-బెలగాం : సోమవారం ఉదయం 10 గం.లకు తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్, ఆం.ప్ర కళాకారుల సంక్షేమ సంఘంల ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ వేదిక శంఖుస్థాపన, సత్యహరిశ్చంద్రీయం గ్రంధావిష్కరణ తోటపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు డొల్లు పారినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆం.ప్ర రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిధిగా విచ్చేయుచున్నారు. ఇదే వేదిక పై సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహింపబడతాయని, తదనంతరం అన్నప్రసాదం ఏర్పాటు చేయబడిందని, ట్రస్టీలు, భక్తులు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సంఘీభావ యాత్రలో పాల్గొనండి : టీడీపీ యువనేత గొంప

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి "నారా లోకేష్" యువ గళం పేరుతో చేపట్టిన పాదయాత్ర 400 రోజులు 4000 కిలోమీటర్లలో భాగంగా సోమవారం నాటికి వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా సంఘీభావ పాదయాత్ర టీడీపీ నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ ఆధ్వర్యంలో నేడు అనగా సోమవారం ఉదయం 8 గంటలకు ఎస్ కోట మండలం, వెంకటరమణపేట గ్రామం నుండి శృంగవరపుకోట నాలుగు రోడ్ల జంక్షన్ వరకు (దేవీ బొమ్మ జంక్షన్ వరకు) యువగళం పాదయాత్రకు సంఘీభావ పాదయాత్ర కొనసాగుతుందని కృష్ణ తెలిపారు. ఈ పాదయాత్రకు శృంగవరపుకోట నియోజకవర్గంలో ఐదు మండలాలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులు ఒక్కపూట మాత్రమే కల్పించాలి

నేడు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను విజయవంతం చేయాలి : సిటూ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధి పనులు ఒక్క పూట మాత్రమే కల్పించాలి కోరుతూ సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శివున్నాయుడు సిఐటియు నాయకులు కొల్లి సాంబ మూర్తి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కేంద్రంలో ఉపాధి కూలీలతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా వడదెబ్బలకు గురై కొంతమంది చని పోయారని ఇంకొంతమంది ఆసుపత్రి పాలయ్యారని కావున వీళ్ళందరినీ ఆదుకోవాలనిడిమాండ్ చేశారు. ఈ సమస్యలపై కూలీలంతా కలిసికట్టుగా మే 15న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

కోటకొండ దుర్గా ఆలయ నిర్మాణానికి దాతలు సహాయం అందించండి

విశాలాంధ్ర-కురుపాం : మండలంలో జి .శివడ పంచాయితీలో గల గిరి శిఖర గ్రామమైనటువంటి కోటకొండ గ్రామ గిరి శిఖరంలో వెలిసినటువంటి దుర్గమ్మ ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించామని భక్తులు ఎవరైనా ఉంటే సహకరించాలని గ్రామ సర్పంచ్ బి .మిన్నారావు , గ్రామ పెద్ద జి. రాజారావు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరి శిఖరాన పురాతనమైన దుర్గమ్మ విగ్రహాలు వెలిశాయని ప్రతి ఏట దసరాకు మొదట పూజగా చినమేరంగి రాజులు శత్రచర్ల వంశీయులు పూజలు చేస్తారని అంతేకాకుండా శ్రీకాకుళం జిల్లా నుంచి మరియు పార్వతీపురం మన్యం జిల్లాకు మధ్య కొండల్లో వెలిసిందని రెండు జిల్లాలు భక్తులు దసరా రోజున వచ్చి పూజలు చేస్తారని కోర్కెలు తీర్చే దుర్గమ్మగా పిలవబడుతుందని కొంతమంది భక్తులు సహకారంతో ఆదివారం నుండి పనులు ప్రారంభించామని ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పది, ఇంటర్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ బొడ్డల సన్మానం

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం జగన్నాధపురం గ్రామ పంచా యతీ .2022-2023 సంవత్సర మునకు గాను 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామంలో ఉన్న విద్యార్థులను గ్రామ సర్పంచ్ బొడ్డల పద్మ సత్యనారాయణ లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు, మాజీ సర్పంచ్ కనిమెరక రమణమూర్తి, వార్డ్ మెంబర్ తెంటు సత్యరావు మంతిని మంగమ్మ, గ్రామ పెద్దలు పట్నాయకుని చిన్నికృష్ణ, పట్నాయుకుని కృష్ణారావు, ఉరిటి శంకర్రావు, కనిమెరక సూర్యనారాయణ, సారిక తాతబాబు పొట్నూరు రౌతు ఈశ్వరరావు, పొట్నూరు గణపతరావు, భోగి రాజారావు, రౌతు పైడిరాజు, పట్నాయకుని శ్రీనివాసరావు, బోగి సురేష్, గ్రామ వాలంటీర్స్, గ్రామంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి...

విశాలాంధ్ర-నెల్లిమర్ల: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు పిలుపునిచ్చారు. జూనియర్ లైన్ మేన్ కీర్తిశేషులు మద్దిల శివ జ్ఞాపకార్థం 2010-11 పదోతరగతి బ్యాచ్ జరజాపుపేటలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ సురేష్ బాబు ప్రారంభించారు. ముందుగా శివ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ ఐసి మెంబర్ పోలుపోతు దుర్గాప్రసాద్, పిఆర్ఓ రాము రక్తసేకరణ చేపట్టారు. యువత సేవకార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. శిబిరంలో 65 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు సుదర్శన బాబు, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, నాయకులు పోలుబోతు నారాయణ మూర్తి, ఎంఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గెలిచింది ...

రానున్న ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయం

రాష్ట్ర ట్రైనింగ్ సెల్ చైర్మన్ డోల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని రానున్న ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ట్రైనింగ్ సెల్ చైర్మన్ డోల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం దేశానికి చారిత్రాత్మక మలుపు తిప్పడానికి నాంది పలికిందన్నారు. ఏఐసీసీ ఉపనేత రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర ప్రజలంతా స్వాగతించారన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని కాంగ్రెస్ పార్టీ నేతలంతా రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలో కూర్చోబెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్న విషయాన్ని ప్రజలంతా గుర్తుంచుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి గ్రామస్థాయి నాయకులంతా కృషి చేయాలన్నారు

బీఎన్‌ఆర్ ఆశ్రమంలో ఘనంగా మాతృ దినోత్సవం

విశాలాంధ్ర-జామి: పిల్లల కోసం తన జీవితాన్ని దారపోసి పిల్లలే తన జీవితమని, ప్రపంచమని బ్రతికే మహోన్నత వ్యక్తి సృష్టిలో అమ్మ మాత్రమే నని అందుకే అమ్మని మించి దేవతలు ఇలలో ఉండరని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా మండలంలోని అట్టాడలో ఉన్న బి.ఎన్.ఆర్.ఆశ్రమంలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఆశ్రమంలోని వృద్ధులతో కేక్ కట్ చేయించి మాతృ దినోత్సవం వివరాలు వారికి తెలియ చెప్పారు. తన కష్టాలను తన కళ్ళల్లోనే దాచేస్తూ పైకి చిరునవ్వులు చిందించే అమ్మకోసం ఎంత చెప్పినా తక్కువే అవుతుందని, బిడ్డ ఏడిస్తే తను తల్లడిల్లిపోయి బిడ్డ నవ్వితే తాను మురిసిపోయి,ఆర్థిక, శారీరక, మానసిక, ఇబ్బందులు కుటుంబంలో ఎదురైన కన్న పేగుకి మాత్రం కష్టం రానివ్వకుండా కంటికి రెప్పలా కాపాడుకునే మహా తల్లి అమ్మ మాత్రమే అని అన్నారు. సమాజం నిర్మాణంలో అమ్మ పాత్ర అనిర్వచనీయమైనదని అటువంటి అమ్మకు జీవితాంతం విధేయులుగా ఉండాల్సిందేనని అన్నారు. ముందుగా ఆశ్రమంలోని వృద్ధ మహిళ షేక్ అప్పయమ్మతో కేక్‌కట్ చేయించి వృద్ధులు అందరికీ తినిపించారు.అనంతరం వృద్ధులకి భీశెట్టి బాబ్జి బోజనాలను వడ్డించారు,

యువగళంనకు సంఘీభావంగా నేడు పాదయాత్ర : కోళ్ల

విశాలాంధ్ర-వేపాడ : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర నేడు అనగా సోమవారంతో 100 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సంఘీభావం తెలుపుతూ నియోజకవర్గంలో సంఘీభావ పాదయాత్ర చేపడుతున్నట్లు శృంగవరపుకోట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి తెలిపారు. ఈ పాదయాత్ర నియోజకవర్గంలోని కొత్తవలస మండలంలోని చింతలపాలెం దగ్గర నుండి కొత్తవలస నాలుగు రోడ్ల కూడలి వరకు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా కార్యకర్తలు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

హిందూ ధర్మా రక్షా సమితి ఆధ్వర్యంలో శోభయాత్ర

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో స్థానిక కోట జంక్షన్ నుండి మూడు లంతర్లు, వెంకటలక్ష్మి థియేటర్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, తిరిగి కోట జంక్షన్ వరకు భారీ హనుమాన్ శోభ యాత్ర నిర్వహించారు. సుమారు 15 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని పురవీ ధుల్లో తిప్పారు. కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్ దాస్ తదితరులు హాజరయ్యారు. ముందుగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్, సంఘటన కార్యదర్శి ఆర్ శ్యామ్ సుందర్, జిల్లా అధ్యక్షులు రామరాజు, పార్థసారథి హిందూ రక్షా సమితి సభ్యులు పాల్గొన్నారు

గ్రంథాలయంలో మాతృదినోత్సవం

విశాలాంధ్ర-పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం ఏడవ రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. ఆది వారం మాతృత్వ దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీ లు నిర్వహించారు. విద్యార్థుల తల్లి ముఖచిత్రం చూసి బొమ్మ గీయడంతోపాటు రంగులు వేయడం నేర్పించారు. ఈ శిక్షణలో సుమారు పిల్లలు 21 మంది విద్యార్థి, విద్యార్థినులు ఈ పోటీలో పాల్గొన్నారు. వచ్చే ఆదివారం బహుమతులు ఇవ్వడం జరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ శిక్షణలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బూరు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే కు ఏపీ జెఏసీ వినతి

విశాలాంధ్ర-బెలగాం: ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మూడవ దశ కార్యాచరణలో భాగంగా "ఉద్యోగుల ఆవేదన చెబుదాం" అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆదివారం ఎపి జెఎసి అమరావతి పార్వతీపురం మన్యం జిల్లా కార్యవర్గ సభ్యులు కలసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించుటకు తగుచర్యలు తీసుకొనకొనవలసినదిగా కోరుతూ వినతిపత్రాన్ని అంద చేశారు. కార్యక్రమంలో ఎపి జెఎసి జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామమూర్తి, అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాస రావు, వైస్ చైర్మన్ కె.వి భవాని, రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు ఎ. సూర్యనారాయణ, పిఎస్ఎల్ కుమార్, బి. శివరామకృష్ణ, ఎం. రమణమూర్తి, హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, పిడిటి ఉద్యోగులు జి. శ్రీనివాసరావు, ఎం .సుధ, ఆర్.ఎస్.వి రావు, పిఎస్ నారాయణ, బిడిపి రావు, బి. ఆనంద్, ఆర్ఎస్ సాహు, కెకె గౌరి, డిఎస్ చలం, విశ్రాంత ఉద్యోగులు గొర్లి అప్పలరాజు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి : తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బెలగాం: తాగివచ్చి భార్యపై అను మానంతో ఆమెపై భర్త దాడి చేయడంతో భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపాలిటి వేమకోటివారి వీధికి చెందిన కొత్తాడ ఆదిలక్ష్మి భర్త కృష్ణతో పెళ్ళయి 20 సంవత్సరాలు అయింది. ఈమె కూలిపని చేసుకొని ఉంటుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త క్రిష్ణకు తాగుడు అలవాటు ఉంది, తాగి వచ్చి ఆమెని, పిల్లలను నిత్యం కొడుతూ ఉండేవాడు. ఆమె అతి కష్టం మీద ఇల్లు గడుపుతుంది. శనివారం, ఆదివారం కూడా బాగా తాగి వచ్చి నిద్రిస్తున్న ఆమె పై అనుమానంతో కర్రతో రక్తం వచ్చినట్లు కొట్టడంతో ఆదిలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమె కుమార్తె, కుమారుడు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేదెప్పుడూ?

వీడియో కాన్ఫరెన్సు తప్ప ఆచరణలో పనులు అంతంత మాత్రం

విశాలాంధ్ర-సీతానగరం: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల గడిచిన కొత్తగా ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయంలలో ఇంతవరకు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రం, మిల్క్ కేంద్రం, లింకు రోడ్లు ఇలా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి ఇంకా రాలేదు. నిధుల కొరతతో పనులు జరగడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ప్రతీ వారం వీడియో కాన్ఫరెన్సు పెట్టి లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ నుండి జిల్లా, మండల, గ్రామ సచివాలయం అధికారుల వరకు చెప్పడం తప్ప ఆచరణలో పనులు పూర్తి చేసిన దాఖలాలు లేవు. దీంతో పాటు సీతానగరం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి వంతెన, గెద్దలుప్పి వద్ద సువర్ణముఖి నదిపై వంతెన పనులు కూడా పూర్తి కాలేదు. మరోవైపు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిచ్చిన జగనన్న కాలనీలో కూడా పెద్ద ఎత్తున ఇళ్ళస్థలాలు ఇచ్చిన నిర్మాణాలు జరగడం లేదు. మండలంలోని దాదాపు 500ఇల్లు ఇంతవరకు లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభం చేసిన దాఖలాలు లేవు. గ్రామాల్లోని మౌలిక సదుపాయాలు కల్పన కోసం ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి బిల్లులు చెల్లింపులు చేసి పనులు పూర్తి జరిగేలా చూడాలని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.ఇంకోవైపు సచివాలయం పరిదిలో కొత్తగా మంజూరైన మిల్క్ కేంద్రాల నిర్మాణాలు ఎక్కడ ప్రారంభం కాలేదుకదా దాని పేరున పెద్దఎత్తున అడ్వాన్సులు వాడినట్లు తెలుస్తోంది. సీతానగరం, గెద్దలుప్పి గ్రామాల వద్ద సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెనలు కూడా నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని శ్రీపైడితల్లెమ్మ వారి ఆలయ సముదాయంలో ఉన్న శ్రీహనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెలివెల సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ విగ్రహాన్ని గ్రామంలో భక్తులు ఊరేగింపు చేసారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: పట్టణంలోని నాగోజీపేట వద్ద గల సంపత్ హనుమాన్ దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త ఇశరపు శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు వెలవలపల్లి కృష్ణ గాయత్రి శర్మ ఆంజనేయ స్వామి వారికి కదలి ఫలములు, నారికేళములు, తమలపాకులతో అర్చన గావించిన అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బ్యాడ్మింటన్ శిక్షణ క్రీడాకారుల క్రాస్ కంట్రీ పరుగు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట కేంబ్రిడ్జి నారాయణ పాఠశాల క్రీడా మైదానంలో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం ఉదయం నారాయణ కేంబ్రిడ్జి పాఠశాల నుండి ఆకులు డిపో వరకు రెండు కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగును ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో 85 మంది శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోచులు మహ మ్మద్ అస్లాం, కొణతాల సురేష్, బర్నికాన హారిక, పంపాన మౌనిక, చింతల మహాలక్ష్మి, కందుబోతు హేమంత్, మట్ట చరణ్ తేజ, కొమ్మినేని భాను ప్రకాష్, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ఈ నెల 31 వరకు జరుగుతుందని శ్రీరాములు తెలిపారు.

లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : హనుమంతుడు ఆశీర్వాదంతో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర కార్యక్రమం మరింతగా విజయవంతం కావాలని నియోజకవర్గ యువనేత గొంప క్రిష్ణ ఆకాంక్షించారు. మండలంలోని చామలాపల్లి పంచాయతీ కొత్తకోట గ్రామంలో స్థానికులు నిర్వహించిన హనుమజయంతి కార్యక్రమంలో గొంప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీటీసీ రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, గ్రామపెద్దలు, యువత ఉన్నారు.

దైవమే మాతృ రూపం.......

మున్సిపల్ చైర్ పర్సన్ గౌరీశ్వరి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: దైవమే మాతృ రూపమని మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరయ్య కేంద్ర శివశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన మాతృ దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దైవమే మరో రూపంలో మాతృమూర్తిగా మనకు లభించిందని అన్నారు. అనంతరం బ్రహ్మకుమారి నిర్వాహకులు రత్నకుమారి ఆధ్వర్యంలో పలువురు మాతృ మూర్తులను సన్మానించారు.

శిరికి గ్రీన్ సిటీ పరిశీలన

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పర్యవేక్షణలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన శృంగవరపుకోట నియోజకవర్గంలో మే 18వ తేదీన ఉన్న నేపథ్యంలో ప్రణాళికా ఏర్పాట్లు, ప్రధానంగా చంద్రబాబు బహిరంగ సభా ప్రాంగణ స్థల పరిశీలన, చంద్రబాబు మే 18 తేదీ రాత్రి బస చేసే శిరికి గ్రీన్ సిటీలో ఉన్న రూమ్ ఫెసిలిటీ వంటి వాటిని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ, అప్పల రాంప్రసాద్ పలువురు నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కొత్తవలస మండలం టీడీపీ సీనియర్ నాయకులు లాలం అర్జునరావు, వేపాడ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, మాజీ ఎంపీటీసీ మళ్ళా రామకృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు, ఖాసాపేట గ్రామ సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొట్టాన విజయ్ కుమార్, టీడీపీ నాయకులు అక్కిరెడ్డి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

యువత ఉపాధి దిశగా అడుగులు వేయాలి

విశాలాంధ్ర - వేపాడ: చదువుకున్న యువత ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధిపై దృష్టి సారించి భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని మండలంలోని సోంపురం గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు అన్నారు. మండలంలోని జాకేరు గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు అప్పలనాయుడు దంపతుల ప్రథమపుత్రుడు బుద్ధ కృష్ణ నియోజకవర్గకేంద్రం ఎస్ కోటలోని శ్రీవేంకటేశ్వర సినిమా హాలు ఎదురుగా గల మేడపై ఏర్పాటు చేసిన హలో మొబైల్ షాపును ఆదివారం సర్పంచ్ గంగరాజు, బుద్ధ అప్పల నాయుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభో త్సవంలో పలువురు ఉద్యోగులు నాయకులు పాల్గొన్నారు.

సర్వస్వం అర్పించేది అమ్మ...!

విశాలాంధ్ర - సీతానగరం: అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏ ఫోన్ స్టేటస్ చూసినా అమ్మల ఫోటోలతో నిండి పోయాయి. వాస్తవానికి ఎవరి ఇంట్లో మాతృమూర్తిని పూజించే కార్యక్రమాలు ఎక్కడ కనిపించలేదన్నది స్పష్టంగా కనిపిస్తుంది. అంతర్జాతీయ మాతృ దినోత్సవ సందర్భంగా తల్లి పిల్లల రూపాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశి నాయుడు వేసిన దృశ్యం అందరినీ ఆకట్టుకున్నది. ఆయన ఏ చిత్రాన్ని అయిన గోరుతో వేసి ప్రపంచ స్థాయిలోనే ప్రశంసలు అందుకున్న మహా వ్యక్తి.

ఒక రచయిత రాసిన కవిత:

జాతిని జాగృత పరిచేది...

జగతిని జ్యోతియై వెలిగించేది

సృష్టికి ప్రతిసృష్టి చేసేది అమ్మ...!

"తన ప్రాణం ఫణంగా పెట్టి మనకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తుంది

మనకంట్లో నలుసుపడితే మనకంటే ముందు కన్నీరు కార్చుతుంది

తను క్రొవ్వొత్తిలా కరిగిపోతూ మనకోసం కాంతుల్ని వెదజల్లుతుంది

తను గంధపు చెక్కలా అరిగిపోతూ సుగంధాల్ని పంచుతుంది

తనురాలిపోతూ పువ్వులా పరిమళాలు పంచుతుంది

మనకోసం అన్ని చేయాలని ఆరాట పడుతుంది

ఎన్ని చేసినా ఇంక ఏదో చేయలేదని చింతిస్తూనే ఉంటుంది."

కష్టాలను, కన్నీళ్లను కడుపులో దాచుకుని మనకోసం సర్వస్వం అర్పించేది అమ్మ...........!

అలాంటి గొప్ప గుణం కలిగిన అమ్మ కోసం ఎన్ని మాటలు చెప్పిన తక్కువే అనిపిస్తుంది.

ప్రపంచంలోని ప్రతీఅమ్మకి అంతర్జాతీయ మాతృదినోత్సవ శుభాకాంక్షలు.

23 నుంచి లక్ష్మిగణపతిస్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో శ్రీలక్ష్మి గణపతిస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, గ్రామప్రజలు తెలిపారు. ఈనెల 23న గణపతి పుణ్యాహవాచనం, రక్షభందనం, అఖండజ్యోతి ప్రజ్వలన, అంకురార్పణ, 24న శ్రీలక్ష్మి గణపతి స్వామి సహస్రనామ అర్చన, శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహానికి నవ కుండ సహిత మహా జల దివాసములు, పంచామృత జల దివాసములు చేస్తామని చెప్పారు. 25న గణపతి పూజ, వాస్తుబలి, వాస్తుతోపకరణం, శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, గోపుర శిఖర పూర్ణ కలశ స్థాపన జరుగుతుందని ఆలయ ప్రధాన కమిటీ సభ్యులు కర్రి బ్రహ్మాచారి, గొట్టాపు లక్ష్మణరావు, భాస్కరరావులు తెలిపారు. ముగింపు రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంను, ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పోలాకీ రాజా నవీన్ ఆచార్య, పోలవరపు కృష్ణావదాని ఆచార్య, చింతాడ గౌరీశంకర్ ఆచార్య, తాడుతూరి కిషోర్ ఆచార్యల ఆధ్వర్యంలో జరుగుతుందని సభ్యులు తెలిపారు.

సకాలంలో జీతాలు ఇవ్వండి బాబూ..

విశాలాంధ్ర-జామి: తమకు ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో విదులు నిర్వహించి, ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్నారు. జామిలో సైతం 104 ఉద్యోగులు తమ నిరసనతెలియజేసారు. 104 ఉద్యోగులుగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇప్పించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.2020 కరోనా కాలం నుంచి సుదూర ప్రాంతాలలో పని చేస్తున్న ఉద్యోగులకు, కొత్త 104 వాహనంసేవకు బదిలీలు కల్పించాలని కోరుతున్నారు. 104 ఉద్యోగులకు అరబిందో కంపెనీ యాజమాన్యం చెల్లించవలసిన ప్రావిడెంట్ ఫండ్ వాటా యాజమాన్యం వారే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలో 104 సిబ్బంది డిఇవో ఆర్. సన్యాసినాయుడు, డ్రైవర్ ఎం. కృష్ణంరాజు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి పూజలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండల పరిధి గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయాల్లో అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీపురంలో సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, ఎస్.కోట గౌరీశంకర్ కాలనీలో గ్రామపెద్దలతో కలిసి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ సుధారాజు దంపతులు అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఇక ఎస్.కోట బ్రాహ్మణ వీధిలోని శ్రీ కోదండ రామాలయంలో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించి భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త హెచ్.సాధుతో పాటు కమిటీ సభ్యులు హెచ్.నానాజీ, హెచ్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- భక్తులకు మజ్జిగ పంపిణీ..

మేజర్ పంచాయితీ మధుర సీతంపేట గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సత్తిబాబు, వార్డు మెంబర్ మూర్తి, ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ వేమలి గోవిందరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

18న చంద్రబాబు బహిరంగ సభకు తరలి రావాలి

విశాలాంధ్ర - వేపాడ: యువగళానికి సంఘీభావంగా 18న నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల పార్టీ ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ వెంకటరమణమూర్తి కోరారు. సోమవారం 15వ తేదీన కొత్తవలస మండలంలోని చింతలపాలెం గ్రామం నుండి కొత్తవలస నాలుగు రోడ్ల కూడలి వరకు పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున యువగళంకు సంఘీభావంగా పాదయాత్రకు, భారీ బహిరంగ సభకు వేపాడ మండలములోని అన్ని గ్రామాలు నుండి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షురాలు మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, లాలం అర్జునరావు, పొట్నూరు వెంకట రత్నాజీ,నాయకులు గుంటపల్లి దేముడు నాయుడు, బోజంకి మహేశ్వర రావు, నిరుజోగి అమ్మ తల్లి నాయుడు గొర్రుపోటు రాము,గొర్రుపోటు ప్రసాద్,గోకాడ అచ్చెన్నాయుడు (మద్దాలు), గోకాడ నాగభూషణం, కోటాన అప్పలనాయుడు, చిటికిరెడ్డి అవతారం, కొప్పుల అప్పారావు,ఉగ్గిన ఈశ్వరరావు, వేచలపు జగ్గుబాబు, కన్నంనాయుడు, గుమ్మడి గణేష్, డెక్క దేముడునాయుడు, గోకడ సత్యం, గంగిరెడ్ల అప్పలనాయుడు, కోన సత్యం,అప్పలసత్యం,నాగిరెడ్డి ముత్యాలనాయుడు, బుసాల రామకృష్ణ, నిరుజోగి బంగారు నాయుడు, మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు, మాజీ ఎంపీటీసీ వెంకటరావు, అప్పలనాయుడు, గొలగాని కృష్ణ, సంజీవ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు ప్రత్యేక సర్వీసులు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక డిపో నుంచి విజయనగరం బైపాస్ మీదుగా విశాఖపట్నంకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. పార్వతీపురం నుంచి విజయనగరం చేరుకోకుండా గొట్లాం, చెల్లూరు మీదుగా విశాఖ నగరానికి అల్ట్రా డీలక్స్ సర్వీసులను నడపడం జరుగుతుందన్నారు. ఈ సర్వీసులు పార్వతీపురం నుంచి ఉదయం ఐదు గంటల 40 నిమిషాలకు, ఏడు గంటల 15 నిమిషాలకు, ఎనిమిది గంటలకు, ఒంటిగంట 20 నిమిషాలకు, రెండు గంటల 15 నిమిషాలకు, మూడు గంటల 15 నిమిషాలకు బయలుదేరి వెళ్తాయని అలాగే విశాఖపట్నం నుంచి పార్వతీపురానికి 6 గంటల 20 నిమిషాలకు, ఏడు గంటల 40 నిమిషాలకు, 9 గంటలకు, ఒంటిగంట 20 నిమిషాలకు రెండు గంటల 20 నిమిషాలకు మూడు గంటల 15 నిమిషాలకు నడపడం జరుగుతుందన్నారు.ఈ సర్వీసుల్లో ప్రయాణం చేసేందుకు ఆన్లైన్ టికెట్ కూడా ప్రయాణికులు తీసుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి కలగాడలో పరదేశమ్మ పండగ

విశాలాంధ్ర - జామి: మండలంలోని కలగాడ గ్రామంలో గ్రామదేవత శ్రీపరదేశమ్మ తల్లి పండగను గ్రామస్థులు నిర్వహిస్తున్నారు. 15వ తేదీనుంచి 17వరకు మూడు రోజులపాటు ఈపండగను నిర్వహిస్తారు. మొదటిరోజైన సోమవారం తొలేళ్ళ ఉత్సవాన్ని నిర్వహించగా, 16న అనుపు కార్యక్రమం జరుగుతుంది. అలాగే 17న దుమ్ముల పండగను చేసి పండగను పూర్తి చేస్తారు. అమ్మవారి పండగ నేపధ్యంలో ఆలయాన్ని సుందరంగా తయారు చేసారు. గ్రామంలో ప్రతీ ఇంటికి బందువుల తాకిడి అధికంగా ఉన్నందున ఎటువంటి తాగునీటి, పారిశుద్య ఇబ్బందులు లేకుండా పంచాయతీ పాలకులు చర్యలు తీసుకుంటున్నారు.

సీబీఎస్ఈ పది ఫలితాల్లో డా. వరలక్ష్మి స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్ గ్రామంలో గల డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. సీబీఎస్ఈ విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ పి.వరలక్ష్మి, ప్రిన్సిపాల్ రమేష్ ఆదివారం తెలిపారు. డాక్టర్ వరలక్ష్మి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బి.షణ్ముఖ నాయుడు 93 శాతం, బి.వెన్నెల 92శాతం, పి.సిరి మహాలక్ష్మి 91శాతం చొప్పున ఎబవ్ డిస్టింక్షన్ సాధించగా.. ఏడుగురు విద్యార్థులు డిస్టింక్షన్, మిగిలిన విద్యార్థులు మంచి ఉత్తీర్ణతా శాతం సాధించారన్నారు. 10వ తరగతి పరీక్షలకు హాజరైన 16మంది విద్యార్థులు సాధించిన విజయాన్ని డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ పి.వరలక్ష్మి, ప్రిన్సిపల్ కండిపల్లి రమేష్ కొనియాడారు. కాగా పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాల పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా పంచరత్నాంజనేయ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట బ్రాహ్మణ వీధిలోని శ్రీ కోదండ రామాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం వేదమంత్రోచ్చారణల నడుమ పంచరత్న ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త హనుమాల శెట్టి సాధు, ఆలయ అర్చకులు వేదుల రవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలను ఎస్.కోటకు చెందిన ప్రముఖ వేద పండితుడు విన్నకోట భాస్కర్ శర్మ చేయించారు. ఈ సందర్భంగా విగ్రహదాతలు పదాల మణి బాబు, విన్నకోట భాస్కర శర్మ, గార్లపాటి సత్యసాయి, మోపాడ శ్రీను, తోట బుల్లిబాబు, మల్లువలస సన్యాసిరావు, మోపాడ ప్రసాద్, సాధు సన్యాసి రావులు నూతన విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధనను నిర్వహించారు.

చెత్త శుద్ధి కేంద్రాలా...? గొడౌన్‌లా....?

ఆమెటి చెత్త శుద్ధి కేంద్రంలో నిర్వాకం

విశాలాంధ్ర - తెర్లాం: ప్రభుత్వం ఏమి ఆదేశాలు ఇచ్చినా క్రింది స్థాయి అధికారులు పని చేయకపోతే ఆ పథకం నిర్వీర్యం అవుతుంది అనడానికి చక్కని ఉదాహరణ ఆమెటి చెత్తశుద్ధి కేంద్రం. ఈ చెత్త శుద్ధి కేంద్రాన్ని హరిత రాయబారులు ఓ గొడౌన్‌లా వాడుకుంటున్నారని అనడానికి ఈ వ్యాను లోడే ఉదాహరణ. చెత్త శుద్ధి కేంద్రంలో హరిత రాయబారులు గ్రామంలో సహకరించిన చెత్తను చెత్త సిద్ధి కేంద్రంలో తడి పొడి చెత్తను వేరు చేసి దానిలో వానపాములు తయారు చేసి ఎరువులను తయారు చేయాలి. మరి అలా చేస్తున్నారంటే అలా జరగలేదని ఈ వ్యానులతో పంపిస్తున్న అట్టలు, చెత్తను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గ్రామంలో తెచ్చిన చెత్తను అందులో కొన్నింటిని గొడౌన్‌లో ఉంచుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. కేజీలు లెక్కన తూయించి అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడం కొసమెరుపు.

ఘనంగా మాతృదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పట్టణంలోని అంబటి సత్రం జంక్షన్ వద్ద గల యేసు ప్రేమాలయంలో ఆదివారం మదర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిలో ఉన్న మాతృమూర్తులు అచ్చెయమ్మ, గుర్రమ్మలను ఘనంగా సన్మానించారు. పాస్టర్ రవికుమార్ సతీమణి సువర్ణ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మనకు త్యాగం, ప్రేమ, పరిచర్య, దైవ భక్తి, సంస్కారం నేర్పించేది అమ్మ అని పేర్కొన్నారు. ఝాన్సీ సుజాన్, సునీత మహేష్ బైబిల్ పఠించారు. మేరీ రత్నం, సువార్తమ్మ ప్రార్థనలు చేసారు. భాగ్య, శ్రీదేవి శ్రీనివాస్, లక్ష్మి విసున్, శ్రీదేవి రమణ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీత కిషోర్ ప్రభ, ఈశ్వరమ్మ, శోభా నాగేశ్వర రావు, కళావతి, జాన్ ఏ శశికళా దేవి విక్టర్, పాస్టర్ రవికుమార్, కోరాడ నాగేశ్వరరావు, దేవరాజు, జాన్, విక్టర్ బాబు పాల్గొన్నారు.

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆద్వర్యంలో

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక కామాక్షి నగర్, శ్రీ చైతన్య స్కూల్ వద్దనున్న బస్ షెల్టర్ వద్ద క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సి.హెచ్. రమణ) మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. స్త్రీ మూర్తులను క్లబ్ పెద్దలు, సభ్యులంతా సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - 102 మాజీ గవర్నర్, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ అమ్మ లేనిదే మనం లేమని అన్నారు. క్లబ్ సీనియర్ సభ్యులు వల్లూరి శ్రీనివాసరావు, తాడ్డి ఆదినారాయణ మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతి రావు, ఉపాధ్యక్షుడు నలమరాజు, జాలీ వాకర్, కిలారి గోవిందరావు, క్లబ్ పెద్దలు పైడయ్య, బి.ఎస్.ఎన్.ఎల్. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా విస్తరిస్తున్న జియో పర్యావరణ యజ్ఞం

విశాలాంధ్ర - వేపాడ: శృంగవరపుకోట పట్టణానికి చెందిన గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ పర్యావరణ యజ్ఞం నియోజకవర్గంలోని ఊరూరా విస్తరిస్తోంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో గల పాఠశాలల్లో దేవుని ఆలయాల ఆవరణల్లోను, చెరువు, కోనేరు గట్లపైన ఉచిత రీతిన అసంఖ్యాక కొబ్బరి మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షింపజేయడంలోనూ జియో సంస్థ ఆదర్శనీయంగా మెలుగుతోంది. తాజాగా వేపాడ మండలంలోని బానాదిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపరదేశమ్మ గుడి ఆవరణలో ఆదివారం 15 కొబ్బరి మొక్కలు, గుడివాడ సమీపంలోని కొండగుళ్ళు ఆలయం వద్ద 10కొబ్బరి మొక్కలు, జగ్గయ్యపేట చెరువు చుట్టూ 55కొబ్బరి మొక్కలు వెరసి 80మొక్కలను నాటారు. హైదరాబాద్‌కు చెందిన గెంటేల యుగంధర్ కళ్యాణి దంపతుల 53వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుమారుడు కేశవ్ సహకారంతో ఈ మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకులు బి రామకృష్ణ మాట్లాడుతూ శుభదినాలను పురష్కరించుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకుంటే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్ సంస్థ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, జియో సహాయ కార్యదర్శి ఎల్.హరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు గుమ్మడి శ్రీనివాసరావు, గుమ్మడి సత్యశివ గణేష్, గుమ్మడి నర్సిబాబు, దేముడు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికలు 138 స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు, ఏమలా లక్ష్మిలు అన్నారు. మండలంలోని ముగడ గ్రామం ఉపాధి హామీ కార్మికులకు మిఠాయిలు తినిపించారు.

ఏపీజీఈఏ నూతన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయాన్ని కేఎల్ పురం యూత్ హాస్టల్ వద్ద జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.రామచంద్రరావు, కంది వెంకటరమణ ఆదివారం ప్రారంభించారు.

పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులపై అనుసరిస్తున్న ఏకపక్ష నిరంకుశ విధానాలు ఎదుర్కోవాలంటే అన్ని సంఘాలు ఐక్యమచ్చంగా ఉమ్మడి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎటువంటి కార్యక్రమాలను చేపట్టిన తామంతా సహకారం అందిస్తామన్నారు అందరి సహకారంతో జిల్లాలోని అన్ని సంఘాలను ఒకే తాటిపై నడవడం ద్వారా రాష్ట్ర నాయకులు దిక్సూచిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా పెన్షన్ దార్ల సంఘం అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, నాయకులు కె.వి ప్రసాద్, ఇస్కాన్ కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె రమేష్ పట్నాయక్, ఈశ్వరరావు బి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, చిన్నం నాయుడు, పి శ్రీనివాసరావు, రమాదేవి, ఎల్వి యుగంధర్, పి శ్రీనివాసరావు, వి భూషణరావు తదితరులు పాల్గొన్నారు.